క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పాదాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: పూల్‌బాగ్ కాలనీలోని పాదాలమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పైడితల్లికి మాజీ ఎమ్మెల్యే పూజలు



పైడితల్లిని పూజిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో మంగళవారం జరిగిన పైడితల్లి సిరిమానోత్సవానికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలంతా బాగుండాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని గ్రామపెద్దలకు సూచించారు. వైఎస్సార్ సీపీ డెంకాడ, పూసపాటిరేగ మండలాల అధ్యక్షులు పిన్నింటి తమ్మునాయుడు, పతివాడ అప్పలనాయుడు తదితరులు కూడా అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మండలంలోని ద్వారపూడి గ్రామం సహా నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏపీఎస్‌బీసీ సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం క్రైమ్: ఏదైనా విపత్తు లేదా అనుకోని ప్రమాదం సంభవించే సమయంలో అటు ప్రజలతో పాటు ప్రభుత్వ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జేసీ సేతు మాధవన్ సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జిల్లా విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై మాక్‌డ్రిల్ మంగళవారం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాణాలు రక్షించుకోవడంతో పాటు ఇతరుల ప్రాణాల రక్షించడంలో పాటించాల్సిన విధానాలను, మెలకువలను సిబ్బంది వివరించారు. విలేకరులతో జేసీ మాట్లాడుతూ విపత్తుల సమయంలో సహాయక సిబ్బందికి ప్రజల పూర్తి సహకారం ఉండాలని, అలాంటప్పుడే నష్టనివారణ తగ్గించడం సాధ్యమవుతుందన్నారు.

నేడు జీపు జాతా ముగింపు సభ

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా మే 10వ తేదీన బొబ్బిలిలో ప్రారంభమైన జీపు జాతా(ప్రచార యాత్ర) బుధవారం విజయనగరానికి చేరుకోనుంది. ఈ నేపథ్యంలో సాయంత్రం 4 గంటలకు కోట వద్ద ముగింపు సభ జరగనుంది. ఈ సభలో జీపు జాతా ఉద్దేశంతో పాటు ఈ నెల 20వ తేదీన చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మె విషయాలను సీఐటీయూ, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు తెలియజేయనున్నారు. లేబర్ కోడ్‌లు రద్దు, మూతపడిన పరిశ్రమల తెరిచివేత, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ భద్రత, ఎనిమిది గంటల పని, అసంఘటిత కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు, సమాన పనికి సమాన వేతనం వంటి తదితర 17 డిమాండ్లు లక్ష్యంగా సమ్మె చేపట్టనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

వైభవంగా పైడితల్లి.. సిరిమానోత్సవం

- జనసంద్రమైన వీధులు
- పైడితల్లి దర్శనానికి పోటీపడిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సిరిమాను ఊరేగింపు

ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

డెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల కొంగుబంగారం..పైడితల్లి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజారి కంది వెంకటరమణ సిరిమాను అధిరోహించగా, జాతరలో ప్రధాన ఘట్టమైన తెల్లపేనుగు, జాలరి వల, అంజలి రథం ముందు బయలుదేరగా, ఆ వెనక సిరిమాను ఊరేగింది. గ్రామ ప్రధాన వీధిలో మూడు సార్లు తిరిగిన సిరిమానును భక్తులు దర్శించుకుని, పైడితల్లీ దయచూపమ్మా.. సిరులతల్లీ కరుణించమ్మా అని నినాదాలు చేశారు. సిరిమానోత్సవంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

120 ఏళ్ల తర్వాత..

సరిగ్గా 120 ఏళ్ల తర్వాత ఈ ఉత్సవం జరగడంతో తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఏ దారి చూసినా భక్తులతో నిండుగా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దర్శనమిచ్చింది. ఉపాధి నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడిన గ్రామస్తులంతా గ్రామం వచ్చేసి, సందడి చేశారు. ప్రతి ఇల్లు బంధుమిత్ర గణంతో కళకళలాడింది. సిరులతల్లికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.



సిరిమాను అధిరోహించేందుకు వస్తున్న పూజారి వెంకటరమణ

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

అక్కివరంలో జరిగిన సిరిమానోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరై, పైడితల్లిని దర్శించుకున్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యేలు పతివాడ నారాయణస్వామినాయుడు, సుజయ్‌కృష్ణరంగారావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కంది సూర్యనారాయణ, పోలిపల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బాలి సత్యనారాయణ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా బాగుండాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

రెండు పూటలా పనులు చేయండి

నెల్లిమర్ల రూరల్: ఉపాధి హామీ పథకం పనులను రెండు పూటలా పనిచేయాలని డ్వామా పీడీ శారదాదేవి సూచించారు. మండలంలోని రామతీర్థం, పెద్దబూరాడపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉదయం 5.30 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తే ఎండదెబ్బ కూడా తగలదన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ బారినపడకుండా పని ప్రదేశంలో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అలాగే అన్ని పంచాయతీల్లో ఇంకుడుగుంతల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అక్రమాలకు తావు లేకుండా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ఆమె వెంట ఏపీవో రామారావు తదితరులు ఉన్నారు.



పెద్దబూరాడపేటలో ఉపాధి పనుల వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డ్వామా పీడీ శారదాదేవి

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు

విజయనగరం ఫోర్ట్: నగరంలోని దోమల మందిరం వద్ద ఉన్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదిక మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఇంటికి దగ్గరలో విద్యుత్ స్తంభం ఉందని తొలగించాలని కొంతమంది, బిల్లులో లోపాలు ఉన్నాయని మరికొంతమంది ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. సమావేశంలో ఈఈ పి.త్రినాథరావు, ఏడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

విజయనగరం టౌన్: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని శ్రీవిజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక ఐడీఎస్ఎంటీ కాంప్లెక్స్ వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆటో కార్మికులకు గుదిబండగా మారిన ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను ఎత్తివేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-చలానా పేరుతో వేలాది రూపాయలు ఫైన్‌లు వేసే విధానాన్ని విడనాడాలని, తక్షణమే ఈ చలానా నుంచి ఆటోకార్మికులను మినహాయించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మికుల హక్కులు పరిరక్షణే లక్ష్యంగా ఈ నెల 20వ తేదీన చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఆటోలు బంద్ చేయాలని, ప్రకాశం పార్కు నుంచి మెయిన్‌రోడ్డు, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వరకు భారీ ర్యాలీ చేపట్టాలన్నారు. అనంతరం సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో సీహెచ్ ధర్మ, కె.రాము తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

రెవెన్యూ పెంపుదలే లక్ష్యంగా పని చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: రెవెన్యూ పెంపుదలే లక్ష్యంగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అడ్మిన్ సెక్రటరీలను ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో వారితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన కాసేపు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో పన్ను పరిధిలోకి రాని నిర్మాణాలకు, తక్కువ పన్ను ఉన్న భవన నిర్మాణాలకు పన్ను విధించే విధంగా చొరవ చూపాలన్నారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, భవనాల కొలతలు నమోదు చేసుకొని తదనుగుణంగా పన్నులను విధించాలన్నారు. ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలన్నారు. చాలా ప్రాంతాల్లో అదనపు భవన నిర్మాణాలకు పన్ను విధింపు లేకుండా ఉన్నాయని గుర్తించామని తక్షణమే ఆయా భవనాలను పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నారు. అలాగే షాప్ రూముల అద్దె బకాయిల వసూలు, ఖాళీగా ఉన్న షాపులకు వేలంపాట నిర్వహించడం, ఖాళీ స్థలాల పన్నులు విధించడం వంటి విధానాలను ఈ నెలాఖరులోగా త్వరితగతిన చేపట్టి, లక్ష్యాలు అధిగమించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరునికి ఘనంగా నివాళులు



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విజయనగరం టౌన్: స్థానిక ఎంఆర్ కళాశాల వద్ద భారత్–పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. 26వ డివిజన్ నాయకుడు విజ్జపు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మురళీనాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ముక్కాముల శ్రీనివాసరావు, కనకరాజు, రామ్‌కోటి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: దేశ సరిహద్దులో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ప్రాణాలు త్యజించిన జవాన్ మురళీనాయక్‌కు మండలంలోని సారిపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. మురళీనాయక్ చిత్రపటంతో 200 మంది భారీ ర్యాలీ చేపట్టి, అమర్ రహే.. మురళీనాయక్.. అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శత్రువుల తూటాలకు బలైన ఆర్మీ జవాన్‌కు మరణం లేదని, ఆయన అమరుడని, దేశ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడని వక్తలు కొనియాడారు. ఆయన దేశ ప్రజల కోసం చేసిన త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఆదినారాయణ, ఎం.రామారావు, బాబూరావు, గోపి, ప్రకాశరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ ర్యాలీ చేస్తున్న సారిపల్లి గ్రామస్తులు

నెల్లిమర్ల: స్థానిక ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద కార్మికులకు ఈ నెల 20వ తేదీన చేపట్టే దేశ వ్యాప్త సమ్మెపై మంగళవారం అవగాహన కల్పించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కనీస వేతనం అమలు, కార్మిక హక్కులు కాపాడుకోవడం, లేబర్ కోడ్‌ల రద్దు, ఈపీఎఫ్ పింఛన్ రూ.9 వేలు చేయాలని, రిటైర్డ్ జూట్ కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు చెల్లించాలని, కార్మికులకు పింఛన్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్న డిమాండ్‌లతో సమ్మె చేయడం జరుగుతోందని, ప్రతిఒక్కరూ సమ్మెలో పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.



నెల్లిమర్ల: సమ్మెపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రామారావు

రోడ్డుపైనే మురుగు..



భోగాపురం మేజరు పంచాయతీ, కొయ్యపేటలో కాలువల ద్వారా వెళ్లాల్సిన మురుగునీరు.. రోడ్డుపైన ప్రవహిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా సీసీ కాలువలు లేకపోవడంతో రోడ్డుపైనే రోజుల తరబడి మురుగు ఉండాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. దుర్వాసన భరించలేకపోతున్నామని, ముక్కు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉండే మురుగుతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయని, మలేరియా, డెంగీ బారినపడతామేమోనని భయంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా కాలువలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. –భోగాపురం

గ్రంథాలయం..శిథిలం!



నెల్లిమర్ల మండలం, గుషిణి పంచాయతీ గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది. 2011లో రచ్చబండ పర్యటనలో భాగంగా గ్రామానికి వచ్చిన ఆనాటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి యువత ఆకాంక్ష మేరకు గ్రామానికి శాఖా గ్రంథాలయాన్ని మంజూరు చేశారు. ఆయన ఆదేశాల మేరకు అప్పట్లో సీఎం సహాయ నిధి నుంచి నిధులు తెప్పించి మరీ గ్రంథాలయ భవన నిర్మాణం చేశారు. అందుబాటులోకి కూడా తీసుకువచ్చారు. కొంతకాలం గ్రంథాలయ నిర్వహణ బాగా జరిగినా క్రమక్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. మౌలిక సదుపాయాలేవీ కల్పించకపోవడంతో పూర్తిగా మూతపడింది. ప్రస్తుతం భవనం అంతా చెదలు పట్టి, కూలే దశలో ఉంది. ఇప్పటికైనా గ్రంథాలయాన్ని బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. –నెల్లిమర్ల రూరల్

ఈత కారాదు విషాదం..



సరదా మాటున ప్రమాదం పొంచి ఉంటుంది. అసలే వేసవికాలం..పిల్లలకు సెలవులు. మండుటెండల నుంచి ఉపశమనం పొందేందుకు చాలామంది చెరువులు, కాలువలు, బావులు, నదులు, సముద్రాలను ఆశ్రయించి, స్నానానికి ఆసక్తి కనబరుస్తుంటారు. కొంతమందికి ఈత రాకపోయినా సహచరులతో సరదాగా నీటిలోకి దిగేస్తుంటారు. దురదృష్టవశాత్తు ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోతుంటారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ఈత సరదా.. సరేగానీ ప్రాణం జాగ్రత్త అని, ఈత కారాదు విషాదం అని పలువురు సూచిస్తున్నారు. భోగాపురం మండలం, ముక్కాం గ్రామ సముద్ర తీరంలో ఇలా సరదాగా ఈతకొడుతున్న పిల్లలను చిత్రంలో చూడొచ్చు. –భోగాపురం

అలరించిన నృత్య ప్రదర్శన



విజయనగరంలోని పైడితల్లి చదురుగుడి వద్ద చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి విశిష్టతను తెలిపే ఈ ప్రదర్శన ఆద్యంతం ఆహూతులను అలరించింది. కళ్లకుకట్టినట్లుగా అమ్మవారి మహిమలను తెలుపగా భక్తులు కరతాళ ధ్వనులతో అభినందించి, కళాకారులను ప్రోత్సహించారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన వారికి ఆలయ నిర్వాహకులు సన్మానించారు. –విజయనగరంటౌన్

సమ్మెను విజయవంతం చేయండి



పూసపాటిరేగ: మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మికుల హక్కులు, చట్టాల రక్షణే లక్ష్యంగా ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని అసంఘటిత రంగ కార్మికుల హక్కుల సాధన సమితి కన్వీనర్ బి.గిరిప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక గాంధీ పార్కు వద్ద సమ్మె పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు, ఎనిమిది గంటల పని, కనీస వేతనం అమలు, సమాన పనికి సమాన వేతనం, తదితర డిమాండ్లతో చేపట్టే ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

పూసపాటిరేగ: మండలంలో ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సూర్యనారాయణ కోరారు. సమ్మె ప్రచారం నిమిత్తం చేస్తున్న జీపు జాతా మంగళవారం స్థానిక మైలాన్ పరిశ్రమ గేటు వద్దకు చేరింది. ప్రభుత్వ రంగ పరిశ్రమలు, కార్మికుల హక్కుల రక్షణే లక్ష్యంగా చేపట్టే సమ్మెలో కార్మిక సంఘాల నాయకులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.